RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:79 | మార్చి 06, 2026 | వెల: రూ.3-00

దినపత్రిక



## ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఉద్యోగి

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఫైల్ క్లియర్ చేయడానికి డబ్బు డిమాండ్
- రూ.35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

## లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికాడు

2లో



## ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణ థర్డ్ వరల్డ్ వార్‌కు నాంది కానుందా?

అమెరికా జోక్యంతో మరింత సెగలు

మధ్యప్రాచ్యంలో మారుతున్న రాజకీయ సమీకరణలు



# ప్రపంచ శాంతికి యుద్ధ ముప్పు

- క్షిపణులు, డ్రోన్ల దాడులతో అల్లాడుతున్న పశ్చిమాసియా
- యుద్ధ జ్వాలల్లో చమురు సెగ..
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు తప్పదా?
- సంక్షోభంపై ప్రపంచ దేశాల ఆందోళన
- అగ్రరాజ్యాల వ్యూహ ప్రతివ్యూహాలు
- యుద్ధం తెచ్చే విలయానికి ముగింపు ఎక్కడ?

2లో

వేద న్యూస్, డెస్క్

ప్రపంచం ఇప్పుడు యుద్ధ ముప్పును ఎదుర్కొంటోంది.. దశాబ్దాల వైరం.. ఇప్పుడు నేరుగా యుద్ధక్షేత్రానికి చేరింది. మధ్యప్రాచ్యంలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న సెగలు, కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా.. మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా అన్న ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు ఇజ్రాయెల్‌కు వెన్నుదన్నుగా నిలుస్తూ అగ్రరాజ్యం అమెరికా మోహరిస్తున్న సైన్యం.. మరోవైపు వెనక్కి తగ్గేదే లేదంటూ ఇరాన్ జారీ చేస్తున్న తీవ్ర హెచ్చరికలు.. వెరసి పశ్చిమాసియా ఇప్పుడు భయంకరంగా మారింది. క్షిపణులు, డ్రోన్ల వర్షంతో అస్థిరంగా మారిన ఈ పరిస్థితులు కేవలం రాజకీయాలనే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే చమురు సంక్షోభం వైపు నెట్టబోతున్నాయి. అల్లాడుతున్న అమాయక ప్రజలు, చిందరవందర అవుతున్న బతుకులు.. అసలు మధ్యప్రాచ్యంలో ఏం జరుగుతోంది? యుద్ధం తప్పదా.. లేక దౌత్యం గెలుస్తుందా? 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం మీకోసం..

## ప్లాస్టిక్ డ్రోన్లతో కొత్త వ్యూహం

అమెరికా-ఇజ్రాయిల్‌కు ఇరాన్ సవాల్

- తక్కువ ఖర్చుతో భారీ దాడుల వ్యూహం
- అమెరికా సైన్యానికి పెరుగుతున్న యుద్ధ ఒత్తిడి
- మిడిల్ ఈస్ట్‌లో శక్తి సమీకరణాల మార్పు

2లో

## గల్ఫ్‌లో అమెరికా ట్యాంకర్‌పై దాడి

ఇరాన్ ప్రతీకార చర్య



2లో

## భారత యుద్ధ విమానం 'సుఖోయ్' మిస్సింగ్

రాడార్‌తో సంబంధాలు తెగిపోవడంతో కలకలం

- సెర్చ్ అండ్ రెస్క్యూ చర్యలు ప్రారంభం
- పైలట్ల ఆచూకీ కోసం గాలింపు

2లో



## నా ఇంటి నెంబర్ ఎత్తుకెళ్లారు..!?

- నాకు మున్సిపల్ అధికారులపై అనుమానం ఉంది
- దొంగ ఎవరో తెలియాలి..?
- నాకు న్యాయం చేయాలి : బాధితుడి ఆవేదన

2లో

## ఆర్ఎంపీల దందా!

పేద ప్రజలకు రోగమొస్తే వారికి పండగే

- గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న వ్యవహారం
- ఇంజక్షన్ వేస్తే వందలే..
- మెడికల్ షాపుల పేరుతో దోపిడీ
- హాస్పిటళ్లతో పర్సెంటేజీ ఒప్పందాలు
- నిద్రమత్తులో ఆరోగ్య శాఖ



2లో

## రాజ్యసభ రేసులో వేం నరేందర్‌రెడ్డి

- సీఎం సలహాదారు పదవికి రాజీనామా
- అసెంబ్లీలో నామినేషన్ దాఖలు
- కాంగ్రెస్ తరపున ఇద్దరు అభ్యర్థులు



2లో

# ఆర్ఎంపీల దందా!

## పేద ప్రజలకు రోగమొస్తే వారికి పండగే

- గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న వ్యవహారం
- ఇంజక్షన్ వేస్తే వందలే.. మెడికల్ షాపుల పేరుతో దోపిడీ
- హాస్పిటళ్లతో పర్సెంటేజీ ఒప్పందాలు



**వేద న్యూస్, బోయినిపల్లి**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆపద సమయంలో అందుబాటులో ఉండి, ప్రాథమిక చికిత్స అందించాల్సిన ఆర్ఎంపీ డాక్టర్లు.. ఇప్పుడు రూటు మార్చారు. సేవే పరమావధిగా సాగాల్సిన వైద్యం, ఇప్పుడు లాభమే లక్ష్యంగా సాగుతున్న కమిషన్ వ్యాపారంగా మారిపోయింది. బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆర్ఎంపీల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, అమాయక రోగుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ఇంజక్షన్ వేస్తే రూ. 120

సాధారణంగా జ్వరమో, ఒళ్లు నొప్పులో వస్తే గ్రామస్తులు మొదటగా ఆశ్రయించేది స్థానిక ఆర్ఎంపీలనే. అయితే, ఇదే అదునుగా భావిస్తున్న కొందరు డాక్టర్లు కనికరం లేకుండా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక సాధారణ ఇంజక్షన్ వేయించుకోవాలంటే కనిష్ఠంగా రూ.100 నుంచి రూ.120 వరకు డిమాండ్ చేస్తున్నారు. రోగి ఆర్థిక పరిస్థితిని బట్టి, అత్యవసరం అని భావిస్తే ఆ ధరను మరింత పెంచుతూ పేద కుటుంబాల నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందే సేవలకు ఇక్కడ భారీగా మూల్యం చెల్లించాల్సి వస్తోంది.

### కమీషన్ల కోసం పెద్దాసుపత్రులకు సిఫార్సు

అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. రోగి పరిస్థితి కొంచెం విషమించినా లేదా చిన్నపాటి శస్త్రచికిత్స అవసరమైనా, ఆర్ఎంపీలు తమకు నచ్చిన ప్రైవేట్ ఆసుపత్రులకే వెళ్లాలని ఒత్తిడి చేస్తున్నారు. 'అక్కడ మాకు తెలిసిన వారున్నారు, ఖర్చు తక్కువ అవుతుంది..' అని నమ్మబలికి రోగులను పంపిస్తున్నారు. కానీ వాస్తవానికి, అక్కడ చేరిన ప్రతి రోగి బిల్లులో 20 నుంచి 30 శాతం వరకు ఈ ఆర్ఎంపీలకు కమీషన్ రూపంలో అందుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. రోగి ప్రాణం కంటే తమకు వచ్చే కమిషనే ముఖ్యమన్నట్లుగా కొందరు వ్యవహరిస్తుండటం విచారకరం.

### క్లినిక్ ముసుగులో మెడికల్ షాపులు

కొంతమంది ఆర్ఎంపీలు ఒకడుగు ముందుకు వేసి, తమ క్లినిక్ ఆవరణలోనే అనధికారికంగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. బయట దొరికే గోలీలు, మందులపై ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలు వసూలు చేస్తూ రోగులను నిలువునా దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మందులు విక్రయించే అర్హత లేకపోయినా, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

### అధికారుల మౌనం

గ్రామాల్లో నిజాయితీగా సేవలు అందించే ఆర్ఎంపీలు ఉన్నప్పటికీ, ఇలాంటి కొందరి స్వార్థం వల్ల మొత్తం వ్యవస్థపైనే ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రభుత్వ వైద్య సదుపాయాలు సరిగ్గా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని సాగుతున్న ఈ దోపిడీని అరికట్టాల్సిన బాధ్యత ఆరోగ్య శాఖపై ఉంది. వెంటనే గ్రామాల్లో ఆర్ఎంపీల క్లినిక్‌లపై తనిఖీలు చేపట్టాలని, అధిక ధరలు వసూలు చేసే వారిపై, అక్రమ మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కై కమిషన్లు తీసుకునే వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని వేడుకుంటున్నారు.

# రాజ్యసభ రేసులో వేం నరేందర్‌రెడ్డి

- సీఎం సలహాదారు పదవికి రాజీనామా
- అసెంబ్లీలో నామినేషన్ దాఖలు
- కాంగ్రెస్ తరపున ఇద్దరు అభ్యర్థులు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ ఆయనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి లాభదాయక పదవుల్లో ఉండకూడదనే నిబంధన ఉండటంతో వేం నరేందర్‌రెడ్డి తన ప్రభుత్వ సలహాదారు పదవికి రాజీనామా చేశారు. ఆయన సమర్పించిన రాజీనామాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదించారు. రాజీనామా అనంతరం వేం నరేందర్‌రెడ్డి ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో కలిసి అసెంబ్లీలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలను అభ్యర్థులుగా నిలిపింది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఈ రెండు స్థానాలను ఏకగ్రీవంగా చకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# ప్రపంచ శాంతికి యుద్ధ ముప్పు!



**వేద న్యూస్, డెస్క్**

మధ్యప్రాచ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ, మతపరమైన ఉద్రిక్తతలు ఇప్పుడు ప్రత్యక్ష యుద్ధానికి దారితీసే ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. అమెరికా జోక్యంతో ఈ ప్రాంతీయ ఘర్షణ కాస్తా అంతర్జాతీయ సంక్షోభంగా రూపాంతరం చెందుతోంది. క్షిపణులు, డ్రోన్ల దాడులతో అస్థిరంగా మారిన ఈ పరిస్థితులు కేవలం భౌగోళిక రాజకీయాలనే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా చమురు సరఫరాను అతలాకుతలం చేసే హెచ్చరికగా మారాయి. మధ్యప్రాచ్యంలో ప్రాబల్యం కోసం ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలు, తన భద్రత కోసం ఇజ్రాయెల్ తీసుకుంటున్న సైనిక చర్యలు ఈ ఘర్షణకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. గతంలో పరోక్ష దాడులకే పరిమితమైన ఈ రెండు దేశాలు, ఇటీవల ఒకరిపై ఒకరు నేరుగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకోవడం పూర్తిస్థాయి యుద్ధ భయాన్ని కలిగిస్తోంది. లెబనాన్‌లోని హిజ్బుల్లా, యెమెన్‌లోని సాయుధ గ్రూపులు కూడా ఈ యుద్ధంలో భాగస్వామ్యమయ్యే అవకాశం ఉండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది.



### అమెరికా జోక్యంతో అంతర్జాతీయ ప్రభావం

ఇజ్రాయెల్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్న అమెరికా, ఆ దేశ భద్రత కోసం సైనిక, వ్యూహాత్మక మద్దతును భారీగా పెంచింది. మధ్యప్రాచ్యంలో తన సైనిక స్థావరాలను బలోపేతం చేస్తూ అవసరమైతే ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతామని అమెరికా ఇస్తున్న సంకేతాలు ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోవైపు, తమ దేశ భద్రతకు ముప్పు వాటిల్లితే తగిన బుద్ధి చెబుతామని ఇరాన్ కూడా వెనక్కి తగ్గకుండా హెచ్చరికలు జారీ చేస్తోంది.

### ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ఈ యుద్ధం కేవలం సైనిక చర్యలకే పరిమితం కాకుండా ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన ఈ ప్రాంతంలో అస్థిరత ఏర్పడితే, చమురు ధరలు ఆకాశాన్నంటి అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చు. ప్రాణనష్టం, శరణార్థుల సమస్య మరియు ఆర్థిక కష్టాలు యుద్ధం తెచ్చే సహజ ఫలితాలని, రాజకీయ నిర్ణయాల వల్ల చివరకు సామాన్య ప్రజలే బలికావాల్సి వస్తుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### దౌత్యమే పరిష్కారం..

యుద్ధం ఎప్పుడూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కాదని చరిత్ర చెబుతున్న పాఠం. ప్రపంచ నాయకత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, దౌత్య చర్చల ద్వారా ఈ సంక్షోభాన్ని ముగించాలని అంతర్జాతీయ సమాజం కోరుతోంది. శాంతి, సంభాషణ మరియు పరస్పర అవగాహన ద్వారానే మధ్యప్రాచ్యంలో స్థిరత్వం సాధ్యమని, ప్రపంచ భవిష్యత్తు ఇప్పుడు నాయకులు తీసుకునే బాధ్యతాయుతమైన నిర్ణయాలపైనే ఆధారపడి ఉందని స్పష్టమవుతోంది.

**ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణ థర్డ్ వరల్డ్ వార్‌కు నాంది కానుందా?**

- అమెరికా జోక్యంతో మరింత సెగలు
- మధ్యప్రాచ్యంలో మారుతున్న రాజకీయ సమీకరణలు
- క్షిపణులు, డ్రోన్ల దాడులతో అల్లాడుతున్న పశ్చిమాసియా
- యుద్ధ జ్వాలల్లో చమురు సెగ..
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు తప్పదా?
- సంక్షోభంపై ప్రపంచ దేశాల ఆందోళన
- అగ్రరాజ్యాల వ్యూహ ప్రతివ్యూహాలు
- యుద్ధం తెచ్చే విలయానికి ముగింపు ఎక్కడ?


# నా ఇంటి నెంబర్ ఎత్తుకెళ్లారు..!?

**వేద న్యూస్, చొప్పదండి**

చొప్పదండి మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం ఒక సామాన్య కుటుంబానికి తీరని ఇబ్బందులు తెచ్చిపెట్టిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి యజమాని ఎటువంటి దరఖాస్తు చేయకపోయినా, కనీస సమాచారం ఇవ్వకుండా ఇంటి నంబర్‌ను ఏకపక్షంగా మార్చివేసిన ఘటన చొప్పదండి మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది. చొప్పదండికి చెందిన కుర్ర ఎల్లయ్య అనే వ్యక్తికి చెందిన ఇంటి నంబర్ రికార్డుల్లో 15-154/A/A/1గా ఉంది. అయితే గత ఫిబ్రవరి 28, 2026న మున్సిపల్ అధికారులు అకస్మాత్తుగా ఈ నంబర్‌ను 15-154/2/A/2గా మార్చివేసినట్లు బాధితుడు ఆరోపిస్తున్నారు. ఈ మార్పు కారణంగా తన సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు హోమ్ లోన్ రికార్డులు, ఆధార్ కార్డు తదితర పత్రాలన్నీ చెల్లకుండా పోయే ప్రమాదం ఉందని ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నేను ఎప్పుడూ డోర్ నంబర్ కరెక్షన్ కోసం దరఖాస్తు చేయలేదు. నా అనుమతి లేకుండా అధికారులు ఎలా మార్చారు? ఇప్పుడు నా హోమ్ లోన్ విషయంలో బ్యాంకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. అధికారుల తప్పుకు నేను ఎందుకు బలి కావాలి?' అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై ఇప్పటికే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల నుంచి సరైన స్పందన లేదని తెలిపారు. ఒకవేళ న్యాయం జరగకపోతే ఎస్టీ కుల కమిషన్‌తో పాటు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తానని హెచ్చరించారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను సంప్రదించగా స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు బాధితుడు తెలిపారు.




- నాకు మున్సిపల్ అధికారులపై అనుమానం ఉంది
- దొంగ ఎవరో తెలియాలి..
- నాకు న్యాయం చేయాలి : బాధితుడి ఆవేదన



# 'సుఖోయ్' మిస్సింగ్

**వేద న్యూస్, డెస్క్**

భారత వాయుసేనకు చెందిన సుఖోయ్ ఎస్ యూ-30ఎంకేఐ యుద్ధ విమానం రాడార్‌తో సంబంధాలు కోల్పోయి అదృశ్యమవడం కలకలం రేపింది. విమానం రాడార్ పరిధి నుంచి హఠాత్తుగా మాయమవడంతో అధికారులు వెంటనే అప్రమత్తమై గాలింపు చర్యలు ప్రారంభించారు. విమానం రాడార్ కాంటాక్ట్ కోల్పోయినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనతో పైలట్ల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. వెంటనే సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను రంగంలోకి దించి విమానం ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ స్పందిస్తూ విమానం రాడార్ కాంటాక్ట్ కోల్పోయిన మాట వాస్తవమేనని తెలిపారు. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. సుఖోయ్ ఎస్ యూ-30ఎంకేఐ భారత వాయుసేనలో అత్యంత శక్తివంతమైన మల్టీ రోల్ ఫైటర్ జెట్‌గా గుర్తింపు పొందింది. రష్యా నుంచి సేకరించిన ఈ విమానాలు సరిహద్దు భద్రతతో పాటు కీలకమైన వైమానిక ఆపరేషన్లలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం విమానంలో ఉన్న సిబ్బంది వివరాలు, ఘటనకు కారణాలు తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# ప్లాస్టిక్ డ్రోన్లతో కొత్త వ్యూహం

## అమెరికా-ఇజ్రాయిల్‌కు ఇరాన్ సవాల్

**వేద న్యూస్, డెస్క్**

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కొత్త యుద్ధ వ్యూహంతో ముందుకొస్తున్నట్లు అంతర్జాతీయ విశ్లేషణలు చెబుతున్నాయి. తక్కువ ఖర్చుతో తయారయ్యే ప్లాస్టిక్ నిర్మాణం కలిగిన చిన్న డ్రోన్లను ఉపయోగించి శత్రు దేశాలపై దాడులు చేసే విధానాన్ని ఇరాన్ పెంచుతున్నట్లు సమాచారం. ఈ విధానం వల్ల ఆధునిక రాడార్ వ్యవస్థలకు అవి సులభంగా కనిపించకపోవడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ సంఖ్యలో పంపగలగడం వంటి కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణల్లో అమెరికా మరియు ఇజ్రాయిల్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే తక్కువ ఖర్చుతో తయారయ్యే డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరగడం వల్ల ఈ రెండు దేశాల రక్షణ వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒక్కోసారి చిన్న డ్రోన్లను అడ్డుకోవడానికి ఖరీదైన క్షిపణులను వినియోగించాల్సి రావడం వల్ల ఆయుధ నిల్వలపై ప్రభావం పడుతున్నట్లు రక్షణ నిపుణులు చెబుతున్నారు.

# గల్ఫ్‌లో అమెరికా ట్యాంకర్‌పై దాడి ఇరాన్ ప్రతీకార చర్య

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల మధ్య గల్ఫ్ ప్రాంతంలో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. హిందూ మహాసముద్రంలో ఇరాన్‌కు చెందిన యుద్ధనౌకపై దాడి జరిగిన కొన్ని గంటల తర్వాత ఉత్తర పర్షియన్ గల్ఫ్‌లో అమెరికాకు చెందిన ట్యాంకర్‌పై ఇరాన్ దాడి చేసినట్లు సమాచారం వెలువడింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. అమెరికా ట్యాంకర్ మంటల్లో చిక్కుకున్నట్లు ఇరాన్‌కు చెందిన మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఇరాన్ యుద్ధనౌకపై జరిగిన దాడి తర్వాత ప్రాంతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఇక మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య తీవ్ర స్థాయిలో యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది.

# లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికాడు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఫైల్‌ను క్లియర్ చేయడానికి లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీకి చెందిన ఉద్యోగి అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డాడు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఖాతా పరిశీలకుడిగా పనిచేస్తున్న సూర్య వంశీ సంతోష్‌ను అధికారులు రంగే చేత పట్టుకున్నారు. రిటైర్మెంట్ ప్రయోజనాలకు సంబంధించిన ఫైల్‌ను ప్రాసెస్ చేయడానికి ఆయన రూ.40 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. అనంతరం ఫిర్యాదు అందుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు పన్నిన ఉచ్చులో రూ.35 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో అతడిని పట్టుకున్నారు. ఈ ఘటనతో జీహెచ్ఎంసీ కార్యాలయంలో కలకలం రేగింది. అరెస్టు చేసిన తర్వాత అధికారులు సూర్య వంశీ సంతోష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఉద్యోగి**

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఫైల్ క్లియర్ చేయడానికి డబ్బు డిమాండ్
- రూ.35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



వేద న్యూస్

శుక్రవారం మార్చి 06, 2026

# మాట తప్పని నేత

- ఆడపిల్ల పెళ్లి కి రూ.5,016 కానుక
- పెళ్లి కూతురు పేరెంట్స్‌కు అందజేత



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామపంచాయతీ ఒకటో వార్డ్ మెంబర్ ఎర్ర రాజు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో భాగంగా ఒకటో వార్డులో ముత్యాల శ్రీనివాస్ రంజిత కుమార్తె అక్షయ వివాహానికి.. ఒక అన్నగా రూ. 5,016 ఆర్థిక సాయం గా అందజేశారు. ఇలాగే పలు కార్యక్రమాల్లో ముందు ఉంటానని, ఒకటో వార్డు అభివృద్ధి కోసం ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేస్తాను అని రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు ఎర్ర రాజు ను గ్రామస్తులు అభినందించారు. ఇచ్చిన హామీ ప్రకారం సాయం చేయడం మంచి విషయమని పేర్కొన్నారు.

# అధ్వాన్నంగా పశువుల నీటి కొట్టాలు

- తాగునీరు అందేలా మరమ్మతులు చేపట్టాలి
- సీపీఎం మండల కమిటీ డిమాండ్

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో పశువుల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నాయని సీపీఎం పార్టీ మండల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పశువులకు తాగునీరు అందేలా మండల కేంద్రంలో ఉన్న నీటి తొట్టెలను యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచులు, అధికారులను కోరింది. అలాగే గ్రామాల ఇరువైపులా ఉన్న నీటి తొట్టెలను కూడా తక్షణమే పునరుద్ధరించాలని



డిమాండ్ చేసింది. మండల కేంద్రంతో పాటు ప్రధాన గ్రామపంచాయతీలను గుర్తించి, నీటి తొట్టెలు లేని గ్రామాల్లో కొత్తగా నిర్మాణాలు చేపట్టి పశువుల దాహం తీర్చేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ పత్రికా ప్రకటనలో తెలిపారు.

# 90శాతం రాయితీపై జిప్సం ఎరువు



- రైతులకు అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు 90 శాతం రాయితీపై జిప్సం ఎరువును అందజేస్తోంది. ఒక మెట్రిక్ టన్ జిప్సం ధర రూ.5,660 కాగా, రాయితీ తర్వాత రైతులు కేవలం రూ.566 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఎకరానికి సుమారు 500 కిలోల జిప్సం ఉపయోగించాలి. ఈ పథకంలో చిన్న, సన్నకారు మరియు మహిళా రైతులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. జిప్సం 50 కిలోల బస్తాల్లో అందుబాటులో ఉండగా, రాయితీ తర్వాత రైతు ఒక్క బస్తాకు రూ.28.30 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత తెలిపారు. జిప్సంలో కాల్షియం, గంధకం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచి అవసరమైన పోషకాలను అందిస్తాయి. చౌడు నేలలను సాగుకు అనువుగా మార్చి నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచుతాయి. ముఖ్యంగా వేరుశనగ వంటి నూనె పంటలలో గింజ నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జిప్సంను పొడి చేసి మట్టిలో సమంగా చల్లాలి. విత్తే ముందు లేదా పంట 3040 రోజుల తర్వాత వేయవచ్చు. ముఖ్యంగా వేరుశనగ పంటలో పూత దశలో మొక్కల మొదళ్ల వద్ద సుమారు 5 సెం.మీ లోతులో కలపాలని అధికారులు సూచించారు. ఆసక్తి గల రైతులు పూర్తి వివరాల కోసం తమ వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

# డబుల్ రోడ్డు కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని నాగుల మల్యాల నుంచి వేములవాడ వరకు వయా విలాసాగర్, మర్లపేట, బోయినిపల్లి మీదుగా డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు భీం రెడ్డి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాంత ప్రజల రాకపోకలకు ఈ రహదారి విస్తరణ అత్యవసరమని, డబుల్ రోడ్డు మంజూరు చేస్తే ప్రాంత అభివృద్ధికి తోడ్పడుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్, తడగొండ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, దుండ్రాపల్లి సర్పంచ్ జంగం అంజయ్య, రత్నంపేట సర్పంచ్ కొడగాని వెంకటేష్, వరదవెల్లి సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' విజయవంతం చేయాలి

- చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మార్కండేయులు

**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్న 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత్ నిర్మాణం వాలంటరీ రాష్ట్ర యువజన సంఘాల నాయకులు, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వేముల మార్కండేయులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన వారికి చేరేలా యువజన సంఘాలు, మహిళా సంఘాలు, అంబేద్కర్ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, యువత కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వం మధ్య వారధిగా యువత అంకితభావంతో పనిచేయాలని అన్నారు. గ్రామీణ యువత కెరీర్ గైడెన్స్, జాబ్ మేళాలు, కుట్టు శిక్షణ కేంద్రాలు, ఉపాధి శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. యువత కంప్యూటర్ పరిజ్ఞానం సాధించి నూతన సాంకేతికతలను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలను పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని మార్కండేయులు కోరారు.



# గృహప్రవేశ వేడుకకు హాజరైన రజక సంఘం నాయకులు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ర్యాగల్ల అంజయ్య-భారతవ్వ దంపతుల ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రజక సంఘం నాయకులు లింగంపల్లి రాజేశం, ర్యాగల్ల రమేష్, ఆకునూరి మల్లయ్య, మైలారం మహేష్ హాజరై దంపతులను అభినందించారు. కొత్త ఇంటిలో సుఖశాంతులతో జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, రజక సంఘం సభ్యులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. గృహప్రవేశం అనంతరం అతిథులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్, బోయినిపల్లి:**



బోయినిపల్లి మండల కేంద్రంలోని శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం విశ్వబ్రాహ్మణ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పోలోజు జగదీశ్వరి చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎదులపురంపురం ప్రభాకర్ చారి, కోశాధికారిగా బోగోజు గంగాధర్ చారి, గౌరవ అధ్యక్షులుగా పుప్పాల దేవయ్య చారి, ముఖ్య సలహాదారులుగా బోగోజి భూమయ్య చారి, బోగోజి ఆంజనేయులు చారిని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా మొగులోజు లక్ష్మిరాజం చారి, బూరుగుపల్లి నరేష్ చారి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చిలుమూరి రమేష్, నాగసముద్రం లక్ష్మణ్, బూరుగుపల్లి రమేష్, రాజూరి రాములు, విశ్వనాథ రాజేశం, నర్సింగ్ నాగభూషణం, బోగోజు శేఖర్, పరమేశ్వర చారి, బోగోజు ప్రసాద్, మొగులోజు ఆంజనేయులు, రాజూరి కిరణ్, బూరుగుపల్లి శ్రీనివాస్ చారి, రాజేందర్, సత్తయ్య, కుంభోజు లక్ష్మణ్, సదానంద చారి, అక్కపెల్లి సత్తయ్య, అక్కపెల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పోలోజు జగదీశ్వరి చారి మాట్లాడుతూ తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

# మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



- వైకుంఠ రథం అందక ట్రాక్టర్‌లో మృతదేహం తరలింపు
- స్థానికుల ఆగ్రహం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీన గ్రామాలకు కనీస సౌకర్యాలు అందడం లేదన్న విషయం మరోసారి బయటపడింది. మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా అంత్యక్రియల కోసం వైకుంఠ రథం కూడా అందుబాటులో లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు చిన్న బోనాలకు చెందిన రేగుల యాదగిరి ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు మున్సిపల్ అధికారులను వైకుంఠ రథం కోసం పలుమార్లు కోరినా స్పందన రాకపోవడంతో చివరకు మృతదేహాన్ని ట్రాక్టర్‌లో శ్మశానానికి తరలించాల్సి వచ్చింది. ఈ ఘటనపై 10వ వార్డు నాయకులు బోల్గం వైష్ణవి, నాగరాజు గౌడ్ మున్సిపల్ యంత్రాంగంపై తీవ్ర విమర్శలు చేశారు. గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటికీ సౌకర్యాల కల్పనలో మాత్రం వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. విలీన గ్రామాలకు ప్రత్యేకంగా వైకుంఠ రథాన్ని కేటాయించాలని, 10వ వార్డు పరిధిలో ఆధునిక శ్మశానవాటిక నిర్మించాలని, అలాగే మున్సిపాలిటీలో అమలవుతున్న '101 రూపాయలకే దహన సంస్కారాలు' పథకాన్ని విలీన గ్రామాల్లోని పేదలకు కూడా వర్తింపజేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# గోదావరి పుష్కర ఘాట్లను పరిశీలించిన అధికారులు



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు పుష్కర ఘాట్లను పరిశీలించారు. గురువారం మెట్‌పల్లి డీఎస్పీ ఎ. రాములు, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ జీ. నవీన్ కుమార్, తహసీల్దార్ వరప్రసాద్ కలిసి పుష్కర ఘాట్ల వద్ద ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోమటి కొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, భర్దిపూర్, వేములకుర్తి గ్రామాల్లో గల గోదావరి పుష్కర ఘాట్లను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# కేకే ఓసీపీలో చోరీ యత్నం

**వేద న్యూస్, మందమర్రి :**

మందమర్రి ఏరియా లోని కేకే ఓసిపిలో గురువారం రాత్రి చోరీ యత్నం కలకలం రేపింది. గురువారం రాత్రి కేకే ఓసీలో కేబుల్ దొంగతనం చేయటానికి పట్టణంలోని చెంచు కాలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రాగా వారిని గమనించిన ఎస్‌అండ్ పిసి ఎంటిఎఫ్ సిబ్బంది వారిని గమనించి వెంబడించి ఒకరిని పట్టుకోగా మరొకరు పారిపోయారు. దొరికిన వ్యక్తిని విచారించగా దొంగతనానికి వచ్చామని చెప్పగా నిందితుని నుండి కేబుల్ కట్ చేయుటకు సంబంధించిన ఆయుధాలు , పవర్ డిటెక్టర్ స్వాధీనం చేసుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్ అండ్ పిసి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తి చేస్తున్నట్లు పట్టణ ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.



వేద న్యూస్

శుక్రవారం మార్చి 06, 2026

# కష్టంతో కాదు ఇష్టంతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలి



- మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్
- విద్యార్థులకు ప్యాడ్స్, పన్నులు పంపిణీ

**వేద న్యూస్, మంథని:**

విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. గురువారం మంథని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ధార్మిక యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంకరి కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నందున గురువులు బోధించిన పాఠాలను క్రమపద్ధతిలో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ధార్మిక యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను అభినందిస్తూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధార్మిక యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏల్పుల వేణు, బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం భరత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాయి విశాల్, ప్రధాన కార్యదర్శి ఆకాష్, జాయింట్ సెక్రటరీ ప్రకాష్, సభ్యులు రిత్విక్, రవికుమార్, శ్రీనివాస్ రెడ్డి, రాకేష్, గౌస్ ఖాన్, మనోజ్, ఓం ప్రకాష్, పవన్, ఆదిత్య, సాయి కృష్ణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తా

- కాప్రా ప్రెస్ క్లబ్ పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**వేద న్యూస్, కాప్రా :**

జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ కమ్యూనిటీ హాల్లో కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు నిరంతరం అందుబాటులో ఉంటానని, సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు నిజాలను నిర్భయంగా రాయాలని సూచించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి నాయకులు బేతి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ జర్నలిస్టులతో ఉద్యమ కాలం నుంచి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చర్లపల్లి మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి మాట్లాడుతూ జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని సూచించారు. జర్నలిస్టులకు కష్టసుఖాల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి మాట్లాడుతూ జర్నలిస్టులు గత దశాబ్దకాలంగా తాను చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రచారం కల్పించి తన ఉన్నతికి ఎంతో దోహదం చేశారని ప్రశంసించారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కాప్రా జర్నలిస్టులతో సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జక్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, టీటీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుగొండ సతీష్ బాబు, బిజెపి డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, బిజెపి సీనియర్ నాయకులు అంబటి వెంకటాచలం, కనుకుల రజనీకాంత్ రెడ్డి, జీవీఎన్ రావు, సుడుగు మహేందర్ రెడ్డి, బిజెపి హెచ్.బి కాలనీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్, సంపత్ రావు, రేగొండ వెంకులు, బిఆర్ఎస్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, మురళి పంతులు, బిఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, బిఆర్ఎస్ హెచ్ బి కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్ కరిపే, బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకురాలు షేర్ మణమ్మ, బిఆర్ఎస్ నాయకులు గోగికర్ శివకుమార్, ఎస్ఏ. రహీం, రేగళ్ల సతీష్ రెడ్డి, శివసేన



రాష్ట్ర కార్యదర్శి పూస శ్రీనివాస్, బిజెపి నాయకులు సుర్వి శ్రీనివాస్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్, బిఆర్ఎస్ నాయకులు సుంకర సుశీల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు గంప కృష్ణ గుప్తా, రేబెల్లి శ్రీనివాస్ గుప్తా, తిరుమల నగర్ కాలనీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మహాత్మా గాంధీనగర్ కాలనీ అధ్యక్షులు బుడంపల్లి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ మాజీ పారా మిలిటరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుర సైదయ్య గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పదవీ ప్రమాణ స్వీకారం**

కాప్రా ప్రెస్ క్లబ్ కార్యవర్గంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, గోవిందుకుంట్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ పదవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పటేల్ నరసింహ, యాట రాజు, వెంకటాపురం రవి, రామకృష్ణ, శ్రీహరి, రవి యాదవ్, వాసు, ఎండి. రియాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు న్యాయ నిర్మాణ్ భవన్‌కు శంకుస్థాపన

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా కేంద్రంలో నూతన న్యాయస్థాన భవన సముదాయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్మించబడనున్న న్యాయస్థాన భవనానికి రేపు ఉదయం 10 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, హైకోర్టు న్యాయమూర్తి మరియు జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాం జి ముఖ్య అతిథులుగా హాజరవుతారు. వీరితో పాటు జస్టిస్ పి. శ్యామ్ కోసి, జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ విజయ సేన్ రెడ్డి, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ జె. శ్రీనివాస్ రావు, జస్టిస్ నందికొండ నర్సింగరావు తదితరులు పాల్గొననున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, న్యాయస్థాన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.




# వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

**వేద న్యూస్, టేక్మాల్ :**



మెదక్ జిల్లా టేక్మాల్ మండలం తంపులూరు గ్రామంలో శివపార్వతుల కల్యాణోత్సవం గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చన అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ఆవరణంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు కల్యాణోత్సవం అనంతరం గ్రామంలో విగ్రహాలను ఊరేగింపు చేశారు. ఊరేగింపు సందర్భంగా స్వాములు చేసిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్తజనానికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.భజన గీతాలతో శివాలయం మారుమరోగింది. ఇందులో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గద్దలపల్లి సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలి

- మంథని ఎస్ఐకి ఫిర్యాదు

**వేద న్యూస్, మంథని:**



మంథని మండలం గద్దలపల్లి (ధర్మారం) గ్రామానికి చెందిన అడ్డూరి సంపత్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త అక్రమంగా పంచాయితీ పెట్టి రూ.2000 వసూలు చేసి అవమానానికి గురిచేశాడని ఆరోపించారు. ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంథని ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల సమయంలో చదువుకున్న వ్యక్తికి ఓటు వేయాలని గ్రామంలో ప్రచారం చేసినందుకు కక్ష కట్టుకుని తనను గ్రామ ప్రజల ముందుకు పిలిపించి అవమానపరిచాడని సంపత్ పేర్కొన్నారు. తన చదువు గురించి వెటకారం చేస్తూ మాట్లాడటమే కాకుండా బలవంతంగా క్షమాపణ చెప్పించి రూ.2000 అక్రమంగా జరిమానా విధించాడని ఆరోపించారు. అంతేకాక తన కిరాణా దుకాణాన్ని తొలగించాలని కూడా ఆదేశించాడని తెలిపారు. గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన సర్పంచ్ కుటుంబం వ్యక్తిగత విభేదాలను ప్రోత్సహిస్తూ పంచాయితీలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. గ్రామంలో గుడుంబా, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, యువకులు మద్యం మరియు మత్తుకు బానిస అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్పంచ్ గ్రామ సమస్యలపై దృష్టి సారించి గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

# తల్లిని మోసం చేసిన కూతురు, అల్లుడు

- రూ. కోటి నగదు, 9 తులాల బంగారం స్వాహా

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి గ్రామానికి చెందిన శ్రావణ పెల్లి రేవతిని ఆమె కూతురు, అల్లుడు మోసం చేసి రూ. కోటి నగదు, 9 తులాల బంగారం తీసుకుని ఇంటి నుంచి బయటకు పంపించారని బాధితురాలు ఆరోపించారు. సిరిసిల్లలోని సిద్ధార్థనగర్ కాలనీలో నివసిస్తున్న తన కూతురు, 'తమ్ముడు నిన్ను చూసుకోడు' అంటూ నమ్మబలికి తన వద్ద ఉన్న నగదు, బంగారం తీసుకుందని రేవతి తెలిపారు. అనంతరం ఇంటి నుంచి బయటకు పంపించడమే కాకుండా తిరిగి ఇంటికి వస్తే చంపేస్తామని అల్లుడు బెదిరించాడని ఆరోపించారు. తన డబ్బులు, బంగారం తిరిగి ఇవ్వాలని అడగడానికి ఇంటి ముందుకు వెళ్లగా కూడా బెదిరించి పంపించారని ఆమె తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో కూతురు, అల్లుడు రెచ్చిపోతూ తనపైనే కేసు పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు. తనకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.

# విద్యార్థినులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

- సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లాలో షీ టీమ్ బృందాలు విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో చట్టం, మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి నెలలో వచ్చిన ఫిర్యాదులపై 4 ఎఫ్ఐఆర్‌లు, 6 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలు, విద్యార్థినులను వేధించిన వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వెల్లడించారు. మహిళలు, విద్యార్థినులు ముఖ్యంగా సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా



వేధింపులకు గురిచేస్తే జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425 కు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# నాలుగు నెలలుగా అందని జీతాలు

- ఇబ్బందులు పడుతున్న ఆరోగ్య మిషన్ ఉద్యోగులు
- కలెక్టర్‌కు వినతి అందజేసి అజీజ్

**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ వైద్య, ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న డాక్టర్లు, సెకండ్ ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు తదితర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని తెలిపారు. దీంతో నెలవారీ అద్దె, స్కూల్ ఫీజులు, నిత్యావసర ఖర్చులు నిర్వహించడం కష్టంగా మారిందని, నెల నెల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినందుకు తెలంగాణ వైద్య & ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

శుక్రవారం మార్చి 06, 2026

## 'పీఎం సూర్యఘర్' సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఐడీఓసీలో ప్రచార రథాన్ని ప్రారంభం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




పీఎం-సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పీఎం-సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు టీ ఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో ఈ పథకంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యుత్ వినియోగదారు తమ ఇళ్ల పైకప్పులపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని సూచించారు. మూడు కిలోవాట్ల సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల సబ్సిడీ అందిస్తుందని, దీని ద్వారా ప్రతి నెలా సుమారు రూ.2 వేల వరకు విద్యుత్ బిల్లు ఆదా చేయవచ్చని తెలిపారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించి అదనపు ఆదాయం కూడా పొందవచ్చని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో ఈ పథకంపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సెస్ ఎండీ బిక్షపతి, డీఈ అంజయ్య, డీఓ మునీందర్ రెడ్డి, ఏడీఓ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి దారుణ హత్య

- రెండ్రోజుల్లో కొడుకు పెళ్లి
- రామడుగు మండల కేంద్రంలో ఘటన

**వేద న్యూస్, రామడుగు:**



మండల కేంద్రంలో పట్టపగలు వృద్ధురాలు ఈరల్ల గౌరమ్మ (60) గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం.. గౌరమ్మ-కొమురయ్య దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మహేష్, అనీల్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మహేష్ విదేశాల్లో ఉండగా ఇటీవల స్వదేశానికి వచ్చాడు. అతనికి స్థానికంగా పెళ్లి సంబంధం కుదిరి మరో రెండు రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. గురువారం మహేష్ పెండ్లి బట్టల కోసం బయటకు వెళ్లగా, కుటుంబ సభ్యులు గ్రామంలో బంధువుల ఇంట్లో జరుగుతున్న పెళ్లికి వెళ్లారు. ఈ సమయంలో ఇంటికి వచ్చిన భర్త కొమురయ్య తన భార్య గౌరమ్మ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటం గమనించి కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, స్థానిక ఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకుని జాగిలాలతో పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంకా రెండు రోజుల్లో పెళ్లి వేడుకలు జరగాల్సిన ఆ ఇంట్లో ఈ ఘటనతో విషాదం నెలకొంది.

## విద్యుత్ కార్మికులకు సన్మానం

**వేద న్యూస్, చొప్పదండి:**




భారత లైన్మెన్ దివస్ సందర్భంగా చొప్పదండి టౌన్ విద్యుత్ సెక్షన్‌లో విద్యుత్ కార్మికులను సన్మానించారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు, కరీంనగర్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సూచనలతో డివిజన్, సెక్షన్ స్థాయిలో ఓఅండ్ఎం విద్యుత్ కార్మికులను అభినందించే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పదండి సెక్షన్ ఏఈ చంద్రయ్య మాట్లాడుతూ.. సేఫ్టీ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని కార్మికులకు సూచించారు. అనంతరం విద్యుత్ కార్మికులను శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఐ ప్రవీణ్ కుమార్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ కె. బ్రహ్మానందం, లైన్మెన్ నాగభూషణం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు సీఎండీ, ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నిషేధిత పత్తి విత్తనాలపై అవగాహన సదస్సు

**వేద న్యూస్, మందమర్రి :**



మందమర్రి మండలం సర్నోన్ పల్లి వద్ద గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బానోతు ప్రసాద్ నిషేధిత పత్తి అయిన గడ్డి మందుని తట్టుకొని పెరిగే పత్తి సాగువలన కలుగు అనర్ధాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేను మాట్లాడుతూ యూయూ సిపి4- ఈపిఎస్ పిఎస్ అను జీన్ ను విత్తనంలో తయారుచేసిన విత్తనాన్ని హెర్బిసైడ్ టాలరెంట్ పత్తిగా పేర్కొంటామని,ఇట్టి పత్తిపై గ్లైపోసిట్ అను గడ్డి మందు పిచికారి చేసిన పత్తి పై ఎటువంటి ప్రభావం లేకుండా కేవలము గడ్డి జాతులు మాత్రమే అంతరిస్తాయని అన్నారు. అట్టి పత్తిని రైతులు వివిధ మార్గాల ద్వారా పొంది సాగుచేస్తున్నారని, ఈ రకమైన పత్తి సాగు వలన భూమి కాలుష్యంతో పాటు భూగర్భ జలాల కాలుష్యం జరిగి భూములు నిర్జీవంగా మారుతాయని, అదేవిధంగా కలుపు నివారణకు గ్లైపోసెట్ అను గడ్డి మందును విరివిగా వినియోగించడం ద్వారా పత్తి మొక్కలు కలుషితము కావడమే కాకుండా అట్టి పత్తిని వినియోగించి నేసిన గుడ్డలు వినియోగించిన మనుషులకు చర్మ సంబంధ క్యాన్సర్లు, పత్తి నుండి వేరు చేసిన గింజల నుండి తీసిన నూనె వినియోగించడం ద్వారా మానవాళికి వివిధ రకాల జన్యు సంబంధ వ్యాధులు సంక్రమిస్తాయని సూచించారు. నూనె తీసిన తర్వాత మిగిలిన పిప్పిని పశువులకు దానా గా వాడుట ద్వారా పాలలో కూడా క్యాన్సర్ కారక అవశేషాలు ఉంటున్నట్లు గుర్తించడం జరిగిందని అందుకే మనదేశంలో ఇట్టి పత్తిని నిషేధించడం జరిగిందని కావున రైతు సోదరులు ఎవరైనా ఇటువంటి విత్తనాలను అమ్మ చూపినట్లయితే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. లైసెన్స్ కలిగిన డీలరు వద్ద నుండి మాత్రమే అనుమతి ఉన్న విత్తనాలను కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్ మై, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, కృషి సఖీలు రజిత, వసంత మరియు రైతులు కమల మనోహర్ రావు, రాయమల్లు, నారాయణరావు, విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బిడ్డల ప్రాణాలకు మంత్రి పొంగులేటి భరోసా

- అర్ధరాత్రి ఆపదొస్తే..ఖమ్మం పరుగు తీయాల్సిన అవస్థలు ఇక ఉండవు
- తిరుమలాయపాలెంలో రూ. 26కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

"అర్ధరాత్రి వేళ ఆపద వస్తే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఖమ్మం పరుగు తీయాల్సిన కష్టాలు ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు ఇక ఉండవు. పేదవాడి సొంత గడ్డపైనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు.

**జిల్లా ఆసుపత్రిని మరిపించేలా వసతులు**

గతంలో కేవలం 30 పడకలతో, అరకొర వసతులతో ఉన్న ఈ ఆసుపత్రి వల్ల ప్రజలు పడ్డ ఇబ్బందులను మంత్రి గుర్తు చేసుకున్నారు. "నాడు ప్రసవం కావాలన్నా, అత్యవసర చికిత్స కావాలన్నా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం తప్ప మరో మార్గం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం వచ్చాక, జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రిని మరిపించేలా ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నాం. డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్యాన్ని రాబోయే కొద్ది నెలల్లోనే ఇక్కడ అందుబాటులోకి తెస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వైద్యులు దేవుళ్లతో సమానం.. ఇక్కడే ఉండాలి!**

వైద్య సిబ్బంది పనితీరుపై మంత్రి దిశానిర్దేశం చేశారు. "ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి భవనాలు కట్టవచ్చు.. కానీ డాక్టర్ అందుబాటులో ఉంటారనే నమ్మకం రోగికి కలిగినప్పుడే ఆ ఆసుపత్రికి సార్ధకత ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది ఎక్కడో ఉండటం కాదు.. ఈ హెడ్ క్వార్టర్స్‌లోనే నివసించాలి. చర్ల, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ కూడా అదే అంకితభావం కావాలి. విధుల్లో చిత్తశుద్ధి చూపే సిబ్బందికి నా నియోజకవర్గం తరపున ప్రత్యేక బహుమతులు అందజేస్తాను" అని ప్రకటించారు.

**విద్య, వైద్యమే మా ప్రభుత్వ అజెండా**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాడికి నాణ్యమైన చదువు, వైద్యం అందించడమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. "కేవలం వైద్యమే కాదు.. రాబోయే రోజుల్లో విద్యారంగంలోనూ విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. గడిచిన రెండేళ్ల మూడు నెలల కాలంలోనే మౌలిక వసతుల కల్పనలో మనం ఎంతో పురోగతి సాధించాం. ఈ ప్రభుత్వం ఎవరినీ నొప్పించదు.. కానీ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలి" అని స్పష్టం చేశారు.

**కాంట్రాక్టర్ కి ఆదేశాలు...**

"మార్చిలో పనులు మొదలవుతున్నాయి.. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, మళ్లీ డిసెంబర్ నాటికే ఈ ఆసుపత్రిని ప్రారంభించాలి" అని గడువు విధించారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు , మండల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## రైతుల భూములు ఆక్రమణకు యత్నం

- 70 ఏళ్లుగా సాగు చేస్తున్నాం..
- హక్కుపత్రాలు కూడా ఉన్నాయంటున్న రైతులు

**వేద న్యూస్, కామారెడ్డి:**



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం అబ్దుల్ నగర్ శివారులో తమ భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు 70 ఏళ్లుగా ఈ భూములపై హక్కు ఉందని, సంబంధిత ప్రభుత్వ పత్రాలు కూడా ఉన్నాయని వారు తెలిపారు. అబ్దుల్ నగర్ శివారులోని సర్వే నెంబర్లు 89, 95, 106, 122లలోని భూములను గత 70 సంవత్సరాలుగా తాము సాగు చేస్తున్నామని రైతులు పేర్కొన్నారు. 1982లో కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా పట్టాలు పొందామని, తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన కొత్త పాస్‌బుక్కులు, పాత పాస్‌బుక్కులు, రైతుబంధు పథకం లబ్ధి కూడా పొందుతున్నామని వివరించారు. అయితే కొందరు వ్యక్తులు తమ భూములపై హక్కులు చూపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాల నుంచి నోటీసులు వచ్చినప్పుడు అవసరమైన అన్ని పత్రాలను సమర్పించామని చెప్పారు. తమ భూములపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజానిజాలను నిర్ధారించి న్యాయం చేయాలని స్థానిక ఎమ్మార్వో, ఆర్డీవోలను బాధిత రైతులు కోరుతున్నారు.

## వేములవాడలో వైభవంగా శివకళ్యాణ మహోత్సవాలు

- ఐదు రోజుల పాటు రాజన్న సేవలో భక్తులు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శివకళ్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది స్వామివారి కళ్యాణ వేడుకలను ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం స్వస్తి పుణ్యాహవాచనం, అంకురార్పణ, దేవతా ఆహ్వానం, చండీ ప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల శుక్రవారం ఆలయ పార్కింగ్ ప్రాంగణంలోని శివార్చన వేదికపై స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామివారి రథోత్సవం కనుల పండువగా జరగనుంది. అనంతరం సోమవారం అవబృతం, ఏకాదశ ఆవరణలతో శివకళ్యాణ మహోత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఆలయ ఈవో ఎల్. రమాదేవి యాగశాలను సందర్శించి అర్చకులతో ఏర్పాట్లపై చర్చించారు. వేద పండితులకు ఆలయ మర్యాదల ప్రకారం వర్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలతో వేములవాడ పరిసర ప్రాంతాల్లో భక్తి వాతావరణం నెలకొంది.

## శ్రీ బాగలాంబిక దేవి శక్తి పీఠాన్ని దర్శించిన అదనపు ఎస్పీ

**వేద న్యూస్, శివంపేట్ :**



మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ శివంపేట్ గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ బాగలాంబిక దేవి శక్తి పీఠాన్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు శాంతి, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి, శివంపేట్ సర్పంచ్, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- ట్రాక్టర్ సీజ్.. నిందితుడికి రిమాండ్




**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆలకుంట రాజు (41) అనే వ్యక్తి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ ఘటనపై ఎల్లారెడ్డిపేట ఎస్సై కె. రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడు ఆలకుంట రాజును అరెస్ట్ చేశారు. అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాహుల్ రెడ్డి హెచ్చరించారు.

## ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రచార కార్యదర్శిగా డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా ప్రచార కార్యదర్శిగా ఇటీవల నియమితులయ్యారు. ది బుద్ధిష్టు సొసైటీ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా అధ్యక్షులు అసఫ్ అలీ లామ చేతుల మీదుగా ఖమ్మంలో గుగ్గిళ్ళ దివ్యమూర్తి ఈ నియామక పత్రాన్ని అందుకున్నారు. తదనంతరం దివ్యమూర్తిని జిల్లా అధ్యక్షులు శాలువాతో ఘనంగా సత్కరించారు.బుద్ధుడు యొక్క చరిత్ర, బౌద్ధ స్తూపాల గురించి పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి గుగ్గిళ్ళ దివ్యమూర్తి అని ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు తెలియజేశారు. 2027 డిసెంబర్ 28 వరకు ఈ పదవీ కాలం ఉంటుందని సొసైటీ సభ్యులు తెలియజేశారు.ఈ పదవి రావడం తనకు సంతోషంగా ఉందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు.ఈ సన్మానం జరగడం సంతోషంగా ఉందని దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 122 వేదికల మీద సన్మానం జరిగిందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కట్టెకోల వెంకటేశ్వర్లు,ఉత్తమ సామాజిక సేవా జాతీయ అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు, అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి అభిమానుల సంఘం ఖమ్మం పట్టణ అధ్యక్షులు గద్దె వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.



## రెండు రోజుల్లో ఇసుక ప్రారంభం కాకపోతే ధర్నా

- గొల్లపల్లి బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తాం
- సర్పంచ్ కొండా రమేష్ గౌడ్




**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో నెలరోజులుగా ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ భవనాలు, ప్రైవేట్ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని గొల్లపల్లి సర్పంచ్ కొండా రమేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఇసుక రాకపోవడంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు, ప్రైవేట్ ఇళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు మండల తహసీల్దార్‌కు వినతి చేసినప్పటికీ స్పందన లేదని, రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. బొప్పాపూర్ హైస్కూల్ సందర్శనకు వచ్చిన కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఇసుక సరఫరా లేకపోవడంతో అనేక డీడీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గతంలో గొల్లపల్లికి ఒక లోడ్ ఇసుక రూ. 2వేలకు లభించేదని, ప్రస్తుతం ఇసుక సూరులు అధికారుల అండతో రూ. 3వేల నుంచి రూ. 4వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల్లో ఇసుక సరఫరా ప్రారంభించకపోతే గొల్లపల్లి బస్టాండ్ వద్ద గ్రామస్తులు, నాయకులతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామానికి స్కేల్ ప్రకారం ఇసుక అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు

## లాడ్జిల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరిక

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని లాడ్జిలు, వసతి గృహాల నిర్వాహకులతో టౌన్ పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణంలో శాంతిభద్రతలు, భక్తుల భద్రత దృష్ట్యా పలు కీలక సూచనలు జారీ చేసినట్లు టౌన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రతి లాడ్జిలో అతిథుల వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, గదులు అద్దెకు తీసుకునే వారి ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను పరిశీలించి వాటి ప్రతులను భద్రపరచాలని సూచించారు. ముఖ్యంగా 18 ఏళ్లలోపు మైనర్లకు తల్లిదండ్రులు లేదా సంరక్షకులు లేకుండా గదులు కేటాయించకూడదని స్పష్టం చేశారు. అలాగే ప్రతి లాడ్జిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రికార్డింగులను భద్రపరచాలని, లాడ్జి గదులు మరియు ప్రాంగణంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని తెలిపారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన లాడ్జిలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

## రాజన్న సన్నిధిలో శివ కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం

- అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శివ కళ్యాణ మహోత్సవాలు గురువారం అంతరంగీకంగా ప్రారంభమైనట్లు అర్చకులు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ మహోత్సవాలు ఐదు రోజుల పాటు కొనసాగుతాయని అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ అంతరాలయంలోనే కళ్యాణోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు పేర్కొన్నారు.జ

## బాధితుడి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు

**వేద న్యూస్, మహబూబాబాద్:**

పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని స్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసి బయ్యారం పోలీసులు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. బయ్యారం గ్రామానికి చెందిన రాయల సతీష్ గాయపడిన కారణంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న బయ్యారం ఎస్ఐ తిరుపతి సంఘటన స్థలానికి స్వయంగా వెళ్లి బాధితుడిని పరామర్శించి అతని ఫిర్యాదును స్వీకరించారు. బాధితుడికి న్యాయం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో సంఘటన స్థలంలోనే ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బీఎన్ఎస్ చట్టం కింద నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నా నిరాశ చెందాల్సిన అవసరం లేదని, అవసరమైతే పోలీసులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ జిల్లా పోలీసులు తెలిపారు.




## డ్రైనేజీ పనులు ప్రారంభించిన సర్పంచ్

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట గ్రామంలోని 2వ వార్డులో మండల పరిషత్ 2022-23 సంవత్సరానికి మంజూరైన రూ. 1,30,000 నిధులతో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ చింతల ఉమా-రవిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ .. డ్రైనేజీ నిర్మాణంతో గ్రామంలో పారిశుధ్య సమస్యలు తగ్గుతాయని, గ్రామాభివృద్ధి ఎజెండాగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్, వార్డు సభ్యురాలు కోల సుజాత తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై అవగాహన సదస్సు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శుల కోసం అవగాహన సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన “ప్రజా పాలనప్రగతి ప్రణాళిక” కార్యక్రమానికి సంబంధించిన 99 రోజుల కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం మార్చి 6, 2026 శుక్రవారం ఉదయం 10:30 గంటలకు బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో జరగనుంది. మండలంలోని అన్ని శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని కార్యక్రమం అమలుకు సంబంధించిన వివరాలను సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు తెలియజేయనున్నారు.

## ఇంటర్ పరీక్షలో మాల్ ప్రాక్టీస్ చేస్తూ ఐదుగురు విద్యార్థులు పట్టివేత

**వేద న్యూస్ హైదరాబాద్ :**



రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి . గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం జ్యూలజీ , హిస్టరీ పరీక్షలు జరిగాయి . ఈ పరీక్షలో 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారు. పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున పట్టుబడ్డారని అధికారులు వివరించారు. గురువారం నాటి పరీక్షలో మొత్తం 4,29,600 మంది విద్యార్థులకు గాను 4,17,656 మంది హాజరయ్యారు. 11,944 మంది గైర్హాజరయ్యారని పరీక్షల అధికారులు వివరించారు.

## ప్రభుత్వ పాఠశాలకు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- మెట్‌పెల్లిలో విద్యా ప్రమాణాల పరిశీలన
- విద్యార్థి చదవలేకపోవడంతో ఆగ్రహం
- 30 రోజుల్లో మార్పు రావాలని హెచ్చరిక



**వేద న్యూస్ జగిత్యాల :**

జగిత్యాల జిల్లా మెట్‌పెల్లిలోని ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల బోధన పరిస్థితులను పరిశీలిస్తూ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు స్థాయిని పరీక్షించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి సరిగా చదవలేకపోవడం గమనించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు కనీస ప్రాథమిక చదవు నైపుణ్యాలు కూడా రాకపోవడం ఆందోళనకరమని పేర్కొంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని ప్రశ్నించారు. ప్రతి విద్యార్థికి సరైన విధంగా చదవడం నేర్పించడం ఉపాధ్యాయుల బాధ్యత అని స్పష్టం చేశారు. పాఠశాలలో బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని చెప్పారు. విద్యార్థులకు ప్రాథమిక చదవు సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. 30 రోజులలోగా ప్రతి విద్యార్థికి కనీసం చదవడం రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మళ్లీ పాఠశాలను సందర్శించే సమయానికి పరిస్థితి మెరుగుపడకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి చదువులో ముందుకు రావడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు.

వేద న్యూస్



# ఉస్తాద్ భగత్ సింగ్‌లో సంగీత మార్పు




**వేద న్యూస్ డెస్క్:**

ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రానికి సంబంధించిన కీలక పరిణామాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా, దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నేపథ్య సంగీతం అందించాల్సిన దేవి శ్రీ ప్రసాద్ స్థానంలో తమన్‌ను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. గత కొద్ది రోజులుగా సామాజిక మాధ్యమాల్లో దేవి శ్రీ ప్రసాద్‌తో సృజనాత్మక విభేదాలు తలెత్తినట్లు ప్రచారం సాగింది. అయితే ఈ వార్తలను నిర్మాణ సంస్థ ఖండించింది. ఎలాంటి విభేదాలు లేవని, పూర్తిగా సమయాభావం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా పూర్తిచేయాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో సంగీత విభాగంలో ఈ మార్పు చేసినట్లు తెలిపింది. చిత్ర బృందం నిర్ణీత గడువులో అవసరమైన భాగాలను అందించలేకపోవడం, అలాగే దేవి శ్రీ ప్రసాద్ ఇతర చిత్రాలతో నిమగ్నమై ఉండటంతో ఆలస్యం సంభవించే అవకాశం ఉందని భావించినట్లు సమాచారం. విడుదలలో జాప్యం రాకుండా ముందస్తు చర్యగా తమన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. విడుదల తేదీపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే మార్చి నెలలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే అభిమానుల్లో భారీ . శక్తివంతమైన కథా నేపథ్యం, ఉత్కంఠభరిత దృశ్యాలు, ప్రభావవంతమైన నేపథ్య స్వరాలు చిత్రానికి ప్రధాన బలాలుగా నిలుస్తాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా సంగీత విభాగంలో చోటుచేసుకున్న ఈ మార్పు సినీ పరిశ్రమలో చర్చనీయాంశమైంది. తమన్ అందించే నేపథ్య స్వరాలు ఈ చిత్రానికి ఎంత మేర ప్రభావం చూపుతాయో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## యూట్యూబ్‌లో 'రై రై రా రా' సాంగ్ నంబర్ 1లో ట్రెండింగ్

**వేద న్యూస్ డెస్క్ :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరియు డైరెక్టర్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ చిత్రం 'పెద్ది' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రం విడుదలకు ముమ్మాటికీ సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఇటీవల రిలీజ్ చేసిన రెండో సాంగ్ 'రై రై రా రా' యూట్యూబ్‌లో నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్ అవుతూ సోషల్ మీడియా వేదికపై హల్‌చల్ సృష్టించింది. ఈ మాస్ అంథెమ్‌ను ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచారు. విడుదలైన కొద్ది గంటల్లోనే మిలియన్ల వ్యూస్ సొంతం చేసుకున్న ఈ పాటలో రామ్ చరణ్ తనదైన శైలిలో డ్యాన్స్ మూమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించారు. అలాగే, హీరోయిన్ జాన్వీ కపూర్ తన గ్లామర్ మరియు ప్రత్యేక ఆకర్షణతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ చిత్రం పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోంది. రామ్ చరణ్ ఊర మాస్ లుక్‌లో కనిపిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్, మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతానికి షూటింగ్ తుది దశలో ఉంది. రామ్ చరణ్ తన పార్ట్ డబ్బింగ్‌ను ఇప్పటికే ప్రారంభించారు. సోషల్ మీడియా మరియు యూట్యూబ్‌లో సాంగ్ విజయం చూస్తే, సినిమా రీస్పాన్స్ కూడా భారీగా ఉండనుంది అని భావిస్తున్నారు. 'పెద్ది' సినిమా, రామ్ చరణ్ మాస్ పెర్ఫార్మెన్స్, జాన్వీ కపూర్ గ్లామర్, ఏఆర్ రెహమాన్ సంగీతం కలసి అభిమానులను తెప్పించేలా ప్రస్తుత ట్రెండ్స్‌ను దఉలుచుకుంటోంది. సినిమా విడుదలకు ముందు ఈ సాంగ్ ట్రెండింగ్ యూట్యూబ్‌లో ఇప్పటికే విజయం సాధించడం, ప్రేక్షకుల అంచనాలను మరింత పెంచుతోంది.




# కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ ఇలియానా


**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా పరిచయమైన ఇలియానా తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేసి, దాదాపు స్టార్ హీరోలందరితో స్క్రీన్ షేర్ చేసి మెప్పించింది. 2006లో 'దేవదాసు' సినిమా ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన ఇలియానా, దశాబ్ద కాలం వెనుదిరిగి చూసుకోలేదు. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, ప్రభాస్, రవితేజ వంటి హీరోలతో స్క్రీన్ షేర్ చేసి భారీ హిట్లను సొంతం చేసుకుంది. ఆ సమయంలో ఆమె తెలుగు ఇండస్ట్రీ నుంచి దూరమై, బాలీవుడ్‌లో ప్రయత్నాలు చేసింది. అయితే అక్కడ పెద్దగా సక్సెస్ సాధించలేకపోయింది.


వ్యక్తిగత జీవితంలో కూడా ఇలియానా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. మొదట ఓ ఫోటోగ్రాఫర్‌తో ప్రేమలో పడింది, కానీ కొంతకాలం తర్వాత విడిపోయారు. ఈ విఫల ప్రేమ కారణంగా ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లింది. అనుకోకుండా బరువు పెరిగింది. కోలుకొని తిరిగి సినిమాల్లో రాణించాలనుకున్నారు, కానీ ఫలితం రాలేదు. ఇంకా ప్రత్యేకం ఏమిటంటే, ఇలియానా రెండవసారి ప్రేమలో పడింది. ఈసారి పెళ్లికాకుండా తల్లి అయ్యింది. ఇటీవలే రెండో బిడ్డకు కూడా జన్మనిచ్చింది. ప్రస్తుతం ఇలియానా సినిమాలకు దూరంగా, కుటుంబంతో సంతోషంగా గడుపుతోంది.కేవలం అందం కాదు, కెరీర్‌లో చేసిన హిట్లు, ఇండస్ట్రీలో సొంత గుర్తింపు, వ్యక్తిగత జీవితంలో ఎదురైన చక్రం, మళ్లీ తల్లి కావడం వంటి సంఘటనలతో ఇలియానా టాలీవుడ్‌లో మరియు బాలీవుడ్‌లో ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని అభిమానులు భావిస్తున్నారు. ఆమె జీవితం కథా చిత్రాల కన్నా రియల్‌గా థ్రిల్లింగ్, సస్పెన్స్, భావోద్వేగాలతో నిండిన అనుభవం అని చెప్పవచ్చు.

ఈ కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ ఇప్పుడు కుటుంబ జీవితం, పిల్లల పట్ల ప్రేమను ప్రధానంగా పెట్టుకుని సంతోషంగా జీవనం సాగిస్తోంది.






# ఉస్తాద్ ఊచకోతకు తేదీ ఖరారు




**వేద న్యూస్ డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ బాధ్యతలతో పాటు సినీ చిత్రాల పనులను కూడా సమాంతరంగా కొనసాగిస్తున్నారు. ఇటీవల రెండు చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన, హరిహర వీరమల్లు చిత్రంతో ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించకపోయినా, ఓజీ చిత్రంతో భారీ విజయం అందుకున్నారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంపై నిర్మాణ సంస్థ స్పష్టత ఇచ్చింది. ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ వేగంగా సాగుతుండగా, పవన్ కళ్యాణ్ తనకు సంబంధించిన భాగాల చిత్రీకరణను పూర్తిచేసినట్లు సమాచారం. ఆయన సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. భారీ వ్యయంతో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. గతంలో పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ కలయికపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. తాజాగా విడుదల చేసిన పోస్టర్ ద్వారా చిత్ర విడుదల తేదీపై పూర్తి స్పష్టత ఇచ్చారు. మొదట ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేయాలని యోచించారు. అయితే అదే నెలలో విడుదల కావాల్సిన కొన్ని భారీ చిత్రాలు వాయిదా పడటంతో పరిస్థితులు మారాయి. పెద్ది చిత్రాన్ని ఏప్రిల్ 30కు మార్చగా, ది ప్యారడైజ్ చిత్రాన్ని ఆగస్టు నెలకు వాయిదా వేశారు. టాక్సిక్ చిత్రం కూడా విదేశీ పరిస్థితుల కారణంగా వాయిదా పడింది. అలాగే మార్చి 19న రావాల్సిన డెకాయిట్ చిత్రం విడుదలను కూడా వాయిదా వేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ప్రదర్శన మందిరాలను దృష్టిలో పెట్టుకుని ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఉగాది, రంజాన్ పండుగలు మార్చి మూడో వారంలో రావడంతో భారీ ప్రారంభ వసూళ్లు సాధించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి ఉస్తాద్ ఊచకోతకు సమయం ఖరారవడంతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.సంస్థ స్పష్టత ఇచ్చింది. ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ వేగంగా సాగుతుండగా, పవన్ కళ్యాణ్ తనకు సంబంధించిన భాగాల చిత్రీకరణను పూర్తిచేసినట్లు సమాచారం. ఆయన సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. భారీ వ్యయంతో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. గతంలో పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ కలయికపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. తాజాగా విడుదల చేసిన పోస్టర్ ద్వారా చిత్ర విడుదల తేదీపై పూర్తి స్పష్టత ఇచ్చారు. మొదట ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేయాలని యోచించారు. అయితే అదే నెలలో విడుదల కావాల్సిన కొన్ని భారీ చిత్రాలు వాయిదా పడటంతో పరిస్థితులు మారాయి.

## అభిషేక్‌కు విరామం సూచన



**వేద న్యూస్ డెస్క్:**

ముంబై ఇరవై ఓవర్ల ప్రపంచకప్ రెండువేల ఇరవై ఆరు సెమీఫైనల్లో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య కీలక పోరుకు రంగం సిద్ధమైన వేళ భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌పై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ముఖ్య వ్యాఖ్యలు చేశారు. నిరంతర ఒత్తిడి మధ్య ఆడుతూ ఉండటం వల్ల బ్యాటింగ్ గాడి తప్పే అవకాశముందని, అలాంటి సమయం లో కొంతకాలం ఆటకు విరామం తీసుకోవడం మంచిదని ఆయన సూచించారు. విరామం తీసుకున్నంత మాత్రాన ఆటగాడి నైపుణ్యాలు తగ్గవని, మానసికంగా తేలిక పడేందుకు అది సహాయపడుతుందని పాంటింగ్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచకప్‌లో అభిషేక్ శర్మ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన అతను కేవలం ఎనభై పరుగులకే పరిమితమయ్యాడు. ఇందులో జింబాబ్వేపై చేసిన యాభై ఐదు పరుగులు మినహాయిస్తే, మిగిలిన మ్యాచ్‌లలో అతను పూర్తిగా విఫలమయ్యాడు. పవర్ ప్లేలో జట్టుకు దూకుడు ఆరంభం ఇవ్వాల్సిన బాధ్యత అతనిపై ఉన్నప్పటికీ, త్వరగా ఔటవుతూ జట్టును ఒత్తిడిలోకి నెట్టాడు. సెమీఫైనల్ వంటి కీలక మ్యాచ్ ముందు ఈ పరిస్థితి జట్టు నిర్వహణలో ఆందోళన కలిగిస్తోంది. మానసిక దృఢత్వం ఈ తరహా పోటీల్లో ఎంతో ముఖ్యం అని పాంటింగ్ విశ్లేషించారు. "విరామం తీసుకోవడం వల్ల ఆటగాడు తన సాంకేతిక నైపుణ్యాన్ని కోల్పోడు. అయితే ఆలోచనలను సరిచేసుకునే అవకాశం లభిస్తుంది. తిరిగి వచ్చినప్పుడు మరింత ఆత్మవిశ్వాసంతో ఆడగలడు" అనే భావనను ఆయన వ్యక్తం చేశారు. సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవాలంటే అభిషేక్ తన సహజ శైలిలో భయపడకుండా ఆడాల్సిన అవసరం ఉందని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. కీలక దశలో యువ ఓపెనర్ తన ప్రతిభను నిరూపించుకుంటాడా లేదా అన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది.

## సూర్యకుమార్‌కు సంజూ తండ్రి అండ



**వేద న్యూస్ డెస్క్:**

భారత జట్టు నాయకుడు సూర్యకుమార్ యాదవ్‌పై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చల నేపథ్యంలో సంజూ శాంసన్ తండ్రి విశ్వనాథ్ శాంసన్ స్పష్టమైన మద్దతు ప్రకటించారు. సూర్యకుమార్ చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని పేర్కొంటూ, "సూర్యకుమార్ నాకు మరో కుమారుడి లాంటి వాడు. సంజూ గురించి ఆయన చెప్పిన మాటల్లో ఎలాంటి ఎటకారం లేదు. అది పూర్తిగా ఆత్మీయతతో చెప్పిన మాట మాత్రమే" అని తెలిపారు. అవసరం లేని వివాదాలను సృష్టించడం తగదని, జట్టులో స్నేహపూర్వక వాతావరణం నెలకొన్నదని ఆయన అన్నారు. సంజూ శాంసన్ కెరీర్‌లో సూర్యకుమార్ యాదవ్, ప్రధాన శిక్షకుడు గౌతమ్ గంభీర్ పోషించిన పాత్రను విశ్వనాథ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. గతంలో ఎవరూ ఇవ్వని స్థాయి మద్దతును వీరిద్దరూ సంజూకు అందించారని, ఆ విశ్వాసమే అతనికి ధైర్యం ఇచ్చిందని పేర్కొన్నారు. వారి ప్రోత్సాహంతోనే సంజూ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు.

ఇరవై ఓవర్ల ప్రపంచకప్ రెండువేల ఇరవై ఆరు టోర్నీలో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన కీలక సూపర్ 8 పోరులో సంజూ శాంసన్ అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించిన సంగతి తెలిసిందే. యాభై బంతుల్లో పన్నెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో తొంభై ఏడు పరుగులు చేసి అజేయంగా నిలిచిన సంజూ ఒంటిచేత్తో లక్ష్యాన్ని ఛేదించాడు. నూట తొంభై ఆరు పరుగుల లక్ష్యాన్ని భారత్ నాలుగు బంతులు మిగిలి ఉండగానే సాధించింది. ఈ అద్భుత ప్రదర్శనకు గాను అతనికి మ్యాచ్ ఉత్తమ ఆటగాడి పురస్కారం లభించింది. ఈ సందర్భంలో సంజూ కుటుంబం జట్టుపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, ముందున్న సెమీఫైనల్ పోరులో కూడా భారత జట్టు విజయాన్ని ఆశిస్తున్నట్లు తెలిపింది.

# మా ఓటమికి వారి బ్యాటింగే కారణం






**వేద న్యూస్ డెస్క్:**

ఇరవై ఓవర్ల ప్రపంచకప్ అర్ధ తుదిపోటీలో దక్షిణాఫ్రికా జట్టుకు న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాజయంపై ఆ జట్టు నాయకుడు ఎయిడెన్ మార్క్రమ్ స్పందించాడు. తమ ఓటమికి ప్రత్యర్థి జట్టు ఆరంభ బ్యాటర్ల దూకుడు ఆటే ప్రధాన కారణమని స్పష్టంగా అంగీకరించాడు. ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్ ఇద్దరూ ఆరంభం నుంచే దాడి శైలిలో ఆడి మ్యాచ్‌ను పూర్తిగా తమ వైపుకు తిప్పుకున్నారని పేర్కొన్నాడు. వారి ఇన్నింగ్స్‌ల కారణంగా తాము బౌలింగ్‌లో ప్రణాళికలు అమలు చేయలేకపోయామని, మ్యాచ్ క్రమంగా చేతుల్లో నుంచి జారిపోయిందని వివరించాడు.

ఈ పోటీలో ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి నూట అరవై తొమ్మిది పరుగులు చేసింది. మైదానం పరిస్థితులు బౌలర్లకు అనుకూలంగా ఉండటంతో పరుగులు సాధించడం సులభం కాలేదని మార్క్రమ్ తెలిపారు. అయినప్పటికీ ఆ స్కోరు పోటీగా నిలుస్తుందని భావించామని చెప్పారు. కానీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఫిన్ అలెన్ కేవలం ముప్పై మూడు బంతుల్లోనే శతకాన్ని నమోదు చేసి మ్యాచ్ దిశను మార్చేశాడు. టిమ్ సీఫర్ట్ కూడా వేగంగా పరుగులు జోడించడంతో తొలి వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదైంది.

మ్యాచ్ అనంతరం మార్క్రమ్ మాట్లాడుతూ ఇరవై ఓవర్ల ఆటలో ప్రారంభ ఓవర్లు ఎంత కీలకమో మరోసారి స్పష్టమైందని పేర్కొన్నాడు. ఆ దశలో వికెట్లు పడగొట్టలేకపోవడం తమకు భారీ నష్టమైందని అన్నాడు. ఈ ఓటమి జట్టుకు తీవ్ర నిరాశ కలిగించినప్పటికీ, దీనినుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో మరింత బలంగా తిరిగి వస్తామని నమ్మకం వ్యక్తం చేశాడు. ఈ పరాజయం దక్షిణాఫ్రికా జట్టుకు మరోసారి అర్ధ తుదిదశలోనే

# బార్బీ 'డ్రీమ్ టీమ్'లో స్మృతి మంధానా






**వేద న్యూస్ డెస్క్:**

భారత మహిళా క్రికెట్ తార స్మృతి మంధానా ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం చేరింది. ప్రముఖ బొమ్మల తయారీ సంస్థ మాట్టెల్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ప్రతిష్టాత్మక "బార్బీ డ్రీమ్ టీమ్"లో మంధానాను ఎంపిక చేసింది. ఈ ఘనత సాధించిన ప్రపంచంలోని తొలి క్రికెటర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. ఆమె రూపాన్ని పోలి ఉండే ప్రత్యేక బార్బీ బొమ్మను కూడా సంస్థ ఆవిష్కరించింది. మహిళా క్రీడాకారిణిలకు స్ఫూర్తినిచ్చే ప్రతీకగా ఈ గుర్తింపు నిలిచింది.

అంతర్జాతీయ క్రికెట్‌లో స్మృతి మంధానా సాధించిన విజయాలు, భారత మహిళా జట్టుకు అందించిన సేవలను గుర్తిస్తూ ఈ ఎంపిక చేసినట్లు సంస్థ వెల్లడించింది. మహిళలు వివిధ రంగాల్లో సాధిస్తున్న ప్రతిభను గౌరవించాలనే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది మంది మహిళలను ఈ డ్రీమ్ టీమ్‌లో చేర్చారు. ఆ జాబితాలో టెన్నిస్ దిగ్గజం సెరీనా విలియమ్స్, పరిశోధక వ్యోమగామి కెల్లీ గెరార్డి, రేసింగ్ డ్రైవర్ రెజినా సిర్వెంట్ అల్వరాడో, ఫుట్‌బాల్ క్రీడాకారిణి క్లోయా కెల్లీ, గాయని హెలెన్ ఫిషర్, పర్వతారోహకురాలు జోజా స్కుబిస్, సర్ఫర్ స్టెఫానీ గిల్మోర్‌తో పాటు స్మృతి మంధానా చోటు దక్కించుకుంది. భారతదేశాన్ని ప్రతినిధిగా నిలబెట్టిన మంధానా ఎంపిక దేశవ్యాప్తంగా క్రీడాభిమానుల్లో ఆనందాన్ని నింపింది. మహిళా క్రికెట్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తెచ్చిన ఈ ఘనత యువ క్రీడాకారిణిలకు ప్రేరణగా నిలవనుంది. మహిళల సాధికారతకు బార్బీ డ్రీమ్ టీమ్ ఒక ప్రతీకగా నిలుస్తుండగా, ఆ జాబితాలో స్మృతి మంధానా స్థానం సంపాదించడం భారత క్రీడా చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా మారింది.

# ఉత్కంఠ సమరంలో భారత్ విజయం

**వేద న్యూస్ డెస్క్:**




అంతర్జాతీయ ఇరవై ఓవర్ల ప్రపంచకప్ రెండో సెమీఫైనల్లో ఇంగ్లాండ్ జట్టుపై భారత్ అద్భుత విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు అర్హత సాధించింది. ముంబైలోని వాంఖడే మైదానంలో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో చివరి వరకూ విజయం దోబూచులాడినా, ఒత్తిడిని జయించిన భారత జట్టు గెలుపు గడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లాండ్ జట్టు పోరాడినా, భారత బౌలర్లు కీలక సమయంలో మెరుగైన ప్రదర్శన చేయడంతో ఆ జట్టు విజయానికి చేరువ కాలేకపోయింది. ఈ విజయంతో భారత్ ఇప్పుడు ఫైనల్లో న్యూజిలాండ్ జట్టుతో తలపడేందుకు సిద్ధమైంది. భారత బ్యాటింగ్‌లో సంజు శాంసన్ మెరుపులు మెరిపించాడు. అతడు 89 పరుగులతో జట్టుకు బలమైన పునాది వేశాడు. శివమ్ దూబే 43 పరుగులతో కీలక భాగస్వామ్యం అందించాడు. ఇషాన్ కిషన్ 39 పరుగులు చేయగా, హార్దిక్ పాండ్యా 27 పరుగులు, తిలక్ వర్మ 21 పరుగులు జోడించారు. మధ్య ఓవర్లలో వేగంగా పరుగులు సాధించడం, చివరి ఓవర్లలో దూకుడుగా ఆడటం భారత జట్టుకు భారీ స్కోరు సాధించడంలో సహాయపడ్డాయి.

ఇంగ్లాండ్ తరఫున విల్ జాక్స్ మరియు ఆదిల్ రషీద్ తలా రెండు వికెట్లు పడగొట్టగా, జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ సాధించాడు. ఇద్దరు భారత బ్యాట్స్‌మెన్ రనౌట్ కావడం గమనార్హం. ఇరవై ఓవర్ల ప్రపంచకప్ చరిత్రలో భారత్ నమోదు చేసిన రెండో అత్యధిక స్కోరు ఇదే కావడం విశేషం. ఈ టోర్నమెంట్‌లోనే జింబాబ్వేపై భారత్ సాధించిన 256 పరుగులే ఇప్పటివరకు అత్యధికంగా నిలిచాయి. మొత్తం ప్రపంచకప్ చరిత్రను పరిశీలిస్తే, 2007లో కెన్యాపై శ్రీలంక జట్టు చేసిన 260 పరుగులు ఇప్పటికీ అత్యధిక స్కోరుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రదర్శన విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్ జట్టు ఆరంభంలోనే దూకుడుగా ఆడుతూ మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చింది. అయితే కీలక సమయంలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసి పరుగుల ప్రవాహాన్ని అడ్డుకున్నారు. ఫీల్డింగ్‌లోనూ భారత ఆటగాళ్లు చురుకుదనాన్ని ప్రదర్శించి కీలక క్యాచ్‌లు పట్టడం, రనౌట్ అవకాశాలను వినియోగించుకోవడం ద్వారా మ్యాచ్‌ను తమ వైపుకు తిప్పుకున్నారు. చివరి ఓవర్లలో ఒత్తిడిని తట్టుకుని విజయాన్ని ఖాయం చేయడం జట్టు సమష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ విజయంతో భారత జట్టు అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌తో తలపడనున్న భారత్ అదే జోరును కొనసాగించాలని సంకల్పంతో ఉంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లో సమతూక ప్రదర్శన కనబరిస్తే కప్ సాధించడం సాధ్యమేనన్న నమ్మకంతో జట్టు ముందుకు సాగుతోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073